క్లుప్తంగా

షిర్డీ సాయి వార్షికోత్సవాలు ప్రారంభం

గురుపౌర్ణమి వరకు జరగనున్న వేడుకలు



కొలువైన షిర్డీ సాయిబాబా

ఇబ్రహీంపట్నం రూరల్: షిర్డీ సాయిబాబా 12వ వార్షికోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. గురుపౌర్ణమి వరకు జరగనున్న ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్ కొత్త కలెక్టరేట్ సమీపంలో ఉన్న షిరిడి సాయి బాబా సంస్థాన్‌లో ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 1వ తేదీ శనివారం నుంచి 03వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు షిరిడిసాయిబాబా సంస్థాన్ చైర్మన్ కల్వకోలు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్‌రెడ్డిలు తెలిపారు.

గీత కార్మికుడి కుటుంబానికి పరామర్శ

కడ్తాల్: మండలంలోని చరికొండలో తాటిచెట్టుపై నుంచి కిందపడిన వల్లపుదాసు నర్సింహగౌడ్ శుక్రవారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు శనివారం పరామర్శించారు. నర్సింహగౌడ్ మృతదేహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. పరామర్శించిన వారిలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, బీచ్యానాయక్, ఎంపీటీసీ రాములుగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు ఉన్నారు.

యువ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యువ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పయిళ్ల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5వ తేదీన ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించనున్న యువ సమ్మేళనానికి నియోజకవర్గం నలుమూలల ను ంచి యువత అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బీఆర్‌ఎస్‌లో యువతకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పాల్గొంటారని తెలిపారు.

నిరుపేద విద్యార్థులకు ఉప్పల అండ

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్టతండాకు చెందిన ముగ్గురు నిరుపేద విద్యార్థుల చదువులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు అండగా నిలిచింది. విద్యార్థులు చేతన్, స్వాతి, నితిన్‌లను ఉప్పల చారిటబుల్ ట్రస్టు తరఫున చదివిస్తామని ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చెప్పారు. నుచ్చుగుట్టతండాకు చెందిన స్వరూప భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలు చేతన్, స్వాతిల చదువులకు ఇబ్బందులు పడుతుంది. అలాగే సరోజ భర్త మృతి చెందడంతో కుమారుడు నితిన్ చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీకి చెందిన కిశోర్‌నాయక్ ద్వారా శనివారం స్వరూప, సరోజలు తమ పిల్లలతో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను కలిసి ఇబ్బందులు వివరించారు. దీనితో వారు చదివినంతవరకు చదివిస్తామని ఉప్పల వెంకటేశ్ వారికి హామీ ఇచ్చారు.

సత్యనారాయణకు సన్మానం

ఇబ్రహీంపట్నం: పదవీ విరమణ చేసిన సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) సత్యనారాయణను ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్ పర్సన్, తెలంగాణ ఛాంబర్ మున్సిపల్ చైర్ పర్సన్ రాష్ట్ర కార్యదర్శి కప్పరి స్రవంతి చందు తలపాగా పెట్టి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ ముగియగానే రేరా చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న సత్యనారాయణకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

స్థలం కేటాయించండి

తలకొండపల్లి: ముదిరాజ్‌ల మహనీయులైన పండుగ సాయన్న, హైదరాబాద్ తొలి మేయర్ కొరివి కృష్ణ, సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు బోళ్ళ యాదగిరి డిమాండ్ చేశారు. శనివారం యాదగిరి ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు గ్రామ సర్పంచ్ లలిత, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ పక్కన విగ్రహాల ఏర్పాటుకు స్థలం అనువుగా ఉందని, స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు బాలకృష్ణ, శ్రీకాంత్, అనిల్, విట్టల్, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ రహదారికి మహర్దశ

రూ.4 కోట్లతో రోడ్డు పునరుద్ధరణ

- శరవేగంగా సాగుతున్న పనులు
- గుంతల రోడ్లకు మోక్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



బొంగ్లూర్ వద్ద సాగర్ రహదారిలో కొనసాగుతున్న పనులు

ఇబ్రహీంపట్నం రూరల్: నాగార్జున సాగర్ రహదారికి మహర్దశ పట్టుకుంది. రోడ్డు పునరుద్ధరణ పనులకు మోక్షం కల్గింది. ఈ రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇబ్రహీంపట్నం నుంచి మొదలుకొని ఔటర్‌రింగ్‌రోడ్డు వరకు రోడ్డు పరిస్థితి ఆధ్వానంగా తయారైంది. సాగర్ రహదారి వెంట రోజుకు వేలాది వాహనాల రాకపోకలు సాగుతుండేవి. దీంతో ప్రయాణం నరకంగా కనిపించేది.

రూ.4కోట్లతో పునరుద్ధరణ పనులు ప్రారంభం

బొంగ్లూర్ ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తా వరకు సుమారు పది కిలోమీటర్లు నాగార్జున సాగర్ ప్రధాన రహదారి పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో రూ.4కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. గత మూడు రోజుల నుంచి గుంతలను పూడ్చి రోడ్డు సరి చేసి తారు వేస్తున్నారు. కుడివైపు రోడ్డు పూర్తి చేస్తున్నారు. ఒక వైపు పూర్తి చేసిన తరువాత వాహనాలకు ప్రత్యామ్నాయం చూపి రెండో వైపు రోడ్డు వేయనున్నారు. పది రోజుల్లో ఇబ్రహీంపట్నం వరకు రోడ్డు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు చెబుతున్నారు. రోడ్డు పూర్తి అయితే ప్రయాణం మరింత సులభతరం కానుంది.

ఎమ్మెల్యే కృషితోనే..



ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చొరవతో ఔటర్‌రింగ్‌రోడ్డు నుంచి ఇబ్రహీంపట్నం వరకు రోడ్డు పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. ఆర్‌అండ్‌బీ నుంచి నిధులు మంజూరు చేశారు. నిత్యం వేలాది వాహనాలు వచ్చిపోయే సాగర్ రహదారి ప్రస్తుతం పాడైపోయింది. ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఇప్పుడు రోడ్డు పనులు సాగుతుండడంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

– పయిళ్ల తిరుమల్‌రెడ్డి, బొంగ్లూర్

ప్రయాణం సాఫీగా సాగనుంది



సాగర్ రహదారి మొత్తం పాడైపోయింది. గతంలో కురిసిన వర్షాల వల్ల చాలా ఇబ్బందికరంగా మారింది. ఎక్కడ చూసిన గుంతలమయంగా మారింది. మంగళ్‌పల్లి గేటు వద్ద రోడ్డుపై గుంతలు పడినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో స్పందిస్తే సమస్యలు పరిష్కరమవుతాయి.

– జహంఘీర్‌ఖాన్ , కాంగ్రెస్ నాయకుడు

నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆమనగల్లు: సీఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరంగా మారిందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండాకు చెందిన నేనావత్ కోమిటి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతుంది. దీంతో కుటుంబ సభ్యులు సాయం చేయాలని ఎమ్మెల్యేనుకోరగా సీఎం సహాయనిధి నుంచి రూ2.50 లక్షలు మంజూరు చేయించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో చెక్కును లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జీఎల్‌ఎస్‌రెడ్డి, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు వీరయ్య, రమేశ్‌నాయక్, జంగయ్యగౌడ్, బిచ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష సాయంపై ఇంటింటి సర్వే



ఇంటింటి సర్వేలో దరఖాస్తుదారుడితో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం: బీసీ, ఎంబీసీ వృత్తిదారుల రూ. లక్ష సాయం దరఖాస్తులపై ఇంటింటి సర్వేను అధికారులు నిర్వహిస్తున్నారు. లక్ష రూపాయల సాయానికి అర్హులు, అనర్హులు ఎవ్వరో గుర్తించే ప్రక్రియలో అధికారులు నిమగ్నమైయ్యారు. మండలంలోని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీలో మున్సిపల్ సిబ్బంది దరఖాస్తుదారుల ఇంటింటికి వెళ్లి విచారణ చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 150, మండలంలోని దండుమైలారం నుంచి 65, కప్పపహాడ్ నుంచి 23, ముకునూర్ నుంచి 17, నాగన్‌పల్లి నుంచి 40, నెర్రపల్లి నుంచి 10, పోచారం నుంచి 52, పొల్కంపల్లి నుంచి 39, రాయపోల్ నుంచి 135, తులేకలాన్ నుంచి 18, తుర్కగూడ నుంచి 16, ఉప్పరిగూడ నుంచి 13, ఎల్మినేడు నుంచి 28, ఎన్గుల గూడ నుంచి 2 దరఖాస్తులు లక్ష రూపాయల సాయం కోసం చేసుకున్నారు.

పార్టీ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

బీఆర్‌ఎస్ నాయకుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మంచాల: బీఆర్‌ఎస్ పార్టీ నిర్మాణంలో యువత పాత్ర చాలా కీలకమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యువజన విభాగ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ యువతకు తగ్గిన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పుట్టిన పాప నుంచి మొదలుకొని పండు ముసలి వరకు ప్రభుత్వం ఫలాలు అందించడం జరుగుతుందన్నారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడమే కాకుండా ఈ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఎక్కువగా ఉపాధి కల్పించే దిశగా పరిశ్రమలను తీసుకొని రావడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి బీఆర్‌ఎస్ పార్టీని అధిక మెజార్టీతో గెలుపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 5వ తేదీన ఇబ్రహీంపట్నంలో నిర్వహించే యువ సమ్మేళన కార్యక్రమానికి యువతను పెద్ద ఎత్తున కదిలి రావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ , ప్రధాన కార్యదర్శి బహదూర్, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీ పాష, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు జెర్కొని రాజు, మండల యువజన విభాగం అధ్యక్షుడు బద్రినాథ్ గుప్తా, కార్యదర్శి విజయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, ఆగాపల్లిలో ఉపసర్పంచ్ ఎం.డీ. రఫిక్ తల్లి చనిపోవడంతో ప్రశాంత్‌కుమార్‌రెడ్డి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తండాలకు రూ.14.24 కోట్ల నిధులు మంజూరు

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



నిధుల మంజూరు వివరాలు వెల్లడిస్తున్న దశరథ్‌నాయక్, నాయకులు

కడ్తాల్: కడ్తాల్ మండలంలోని 9 తండాలకు బీటీ రహదారుల నిర్మాణానికి, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.14.24 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన నిధులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి కర్కల్ పహాడ్ గ్రామం నుంచి నార్లకుంట తండా మీదుగా, చల్లంపల్లి వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.3.30 కోట్లు, చరికొండ బీటీ రోడ్డు నుంచి బోయిన్‌గుట్టతండా వరకు రూ.రూ.2.10 కోట్లు, గడ్డమీదితండా పీడబ్ల్యూ రోడ్డు నుంచి వెలుగురాళ్లతండా రోడ్డుకు రూ.1.20 కోట్లు, మక్తమాధారం నుంచి నాగిరెడ్డి తండా బీటీ రోడ్డుకు రూ.1.20 కోట్లు, అన్మాస్‌పల్లి నుంచి పుల్లేరుబోడ్ తండా బీటీ రోడ్డుకు రూ.1.20 కోట్లు, కడ్తాల్ నుంచి కానుగుబావితండా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.20 కోట్లు, అన్మాస్‌పల్లి బీటీరోడ్డు నుంచి పోచమ్మగడ్డ తండా రోడ్డుకు రూ.75 లక్షలు, వాస్‌దేవ్‌పూర్ నుంచి బాలాజీనగర్ తండా బీటీ రోడ్డుకు రూ.1.50 కోట్లు, రేకులకుంటతండా నుంచి చల్లంపల్లి బీటీ రోడ్డుకు రూ.2.10 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఆయా 9 తండాలకు సంబంధించిన రోడ్ల నిర్మాణ పనులకు, సోమవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేయనున్నట్లు జెడ్పీటీసీ తెలిపారు. బీటీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు , సీఎం కేసీఆర్‌కు తండావాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి గిరిజనులు అండగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, వైస్‌ఎంపీపీ ఆనంద్, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ వీరయ్య, ఎంపీటీసీలు గోపాల్, లచ్చిరామ్‌నాయక్, సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, లోకేశ్, సులోచన సాయిలు, కమ్లీబీచ్యానాయక్, పూజాదేవానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యా, ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, రమణ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేస్తాం

స్వర్ణశక్తి కర్ణ అభియాన్ పర్యవేక్షకుడు షణ్ముగ సుందర్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

తలకొండపల్లి: రానున్న సాధారణ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగుర వేసేందుకు కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని స్వర్ణశక్తి కర్ణ అభియాన్ పనుల పర్యవేక్షకుడు షణ్ముగ సుందర్ అన్నారు. శనివారం మండలంలోని వెంకట్రావ్‌పేట్‌లో 39,40 బుత్‌ల్లో స్వర్ణశక్తి పనుల్లో భాగంగా పార్టీ పటిష్టత, 9 ఏళ్లలో పీఎం నరేంద్రమోదీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాయా లేదా ఆయా బుత్‌ల్లో తిరిగి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ప్రధాని మంత్రి ప్రవేశపెట్టిన కేంద్ర పథకాల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ గెలుపునకు పోరాటం చేయాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, బీజేపీ మండలాధ్యక్షుడు రవిగౌడ్, కుమార్, శివ, ధనంజయ, మహేశ్, హరికాంత్, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీని నియమించాలి

పూజారి రమేష్

మంచాల: పీఆర్సీ కమిటీని నియమించి ఒకే విడతతో డీఏ బకాయిలు చెల్లించాలని తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 2023 జూన్ మాసంతో పీఆర్సీ గడువు ముగిసిందన్నారు. జూలై మాసంలో ఐఆర్ ప్రకటించి వెంటనే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జనవరి 2022 నుంచి రావాల్సిన డీఏ బకాయిలను సీపీఎస్ ఉద్యోగులకు 17నెలల వాయిదాలతో ఇస్తామని ఉత్తర్వులు ఇవ్వడం సరైన నిర్ణయం కాదన్నారు. గతంలో సీపీఎస్ ఉద్యోగులకు డీఏ ఎరియర్స్ నగదు రూపంలో నేరుగా వారి ఖాతాలకు ఒకే విడతలో జమ చేసే వారని తెలిపారు. ప్రస్తుతం స్వరాష్ట్రంలో ఉద్యోగుల దుస్థితి దయనీయంగా మారిందని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నగదు రూపంలో ఒకే విడుతలో ఇవ్వాలన్నారు. వెంటనే ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతలు కల్పించి, బదిలీలు చేపట్టాలని చెప్పారు. అనేక మంది ఉపాధ్యాయులు పదోన్నతలు లేకుండానే పదవీ విరమణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అభ్యర్థులకు సర్టిఫికెట్ల అందజేత

తలకొండపల్లి: మండల ఐకేపీ ఆధ్వర్యంలో పొదుపు మహిళా సంఘాల నుంచి ఒక్కరు చొప్పున మండలంలోని వెల్జాల్, యడవల్లి, చుక్కాపూర్, మెదక్‌పల్లి క్లస్టర్ల గ్రామాల నుంచి వీఓఏలు భాగ్యలక్ష్మి, మంజుల, అంజలి, శ్రీలతలు ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ పొందేందుకు ఎంపికయ్యారు. శంషాబాద్ ముచింతల్ ఆర్క్‌సెట్ బిల్డింగ్‌లో ఐదు రోజుల పాటు వీరికి శిక్షణ ఇచ్చారు. వీరి శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాకర్ వీరికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ పొందడమే గాకా, శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామాల్లోని మిగతా సభ్యులకు చెప్పాలన్నారు. అవసరమైతే గ్రామస్థాయిలో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం బాలురాజు తదితరులున్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రభాకర్

ఉద్యోగ సాధనే లక్ష్యంగా..



మాట్లాడుతున్న ఎంపీపీ కృపేశ్, జగదీశ్వర్

ఇబ్రహీంపట్నం: యువత ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఎంకేఆర్ ఫౌండేషన్ కృషి చేస్తుందని ఎంపీపీ కృపేశ్, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, ఆ పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్‌లు అన్నారు. ఇబ్రహీంపట్నంలోని శాస్త్ర గార్డెన్‌లో శనివారం నిర్వహించిన విద్యార్థి, యువజన ముఖ్యానాయకుల సమావేశ అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆయన తనయుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఎంకేఆర్ ఫౌండేషన్ స్థాపించి నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉచిత శిక్షణను ఇవ్వడంతో ఎంతో మంది యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ప్రైవేట్ కంపెనీలను నియోజకవర్గంలో ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 5న ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించే విద్యార్థి- యువజన సమ్మేళనానికి ప్రతి గ్రామ, ప్రతి వార్డు బీఆర్‌ఎస్ కమిటీలు, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ధ్రువకుమార్, శ్రీరామ్, రమేశ్ , గోపాల్, రవీందర్, శివ, పవన్, నవీన్, శేఖర్, దేవేందర్‌గౌడ్, గిరి, బాను పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

గ్రీన్ ఇండియా చాలెంజ్ కో ఫౌండర్ రాఘవ



కడ్తాల్: మొక్క నాటుతున్న రాఘవ, ఇతర నాయకులు

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని, గ్రీన్ ఇండియా చాలెంజ్ కో ఫౌండర్ సంజీవల్ల రాఘవ అన్నారు. శనివారం మండలంలోని పల్లెప్రకృతి వనాన్ని స్థానిక సర్పంచ్ లక్ష్మీ నర్సింహరెడ్డితో కలిసి సందర్శించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో మొక్కలు నాటడం జరుగుతుందని, తద్వారా 24 శాతం అవరించి ఉన్న పచ్చదనం 33శాతానికి చేరుకుందని తెలిపారు. గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకమండలి ఆధ్వర్యంలో మొక్కలు నాటి సంరక్షిస్తున్న విధానం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అశోక్, నాయకులు భాస్కర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటిన ఐటీ ఉద్యోగులు

యాచారం: మండలంలోని చౌదర్‌పల్లి- చింతుల్ల గ్రామాల మధ్యన రోడ్డుకు ఇరుపక్కల శనివారం పలు ఐటీ కంపెనీల ఉద్యోగులు మొక్కలు నాటారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి వ్యక్తి ప్రతి ఏటా ఐదేసి మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. భవిష్యత్తులో వాతావరణ సమస్యల నుంచి ప్రాణాలతో బయటపడాలంటే పచ్చదనం ఉంటేనే సాధ్యమని తెలిపారు. రోడ్డు ఇరు పక్కల ఉన్న వ్యవసాయ బావుల రైతులతో మాట్లాడి విరివిగా మొక్కలు నాటాలని సూచించారు.

ఘనంగా డాక్టర్స్ డే



డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సి.శ్రీనివాస్‌రెడ్డి, దివ్యరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, జిల్లా కార్యదర్శి రమేశ్, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి వెంకటయ్య, సభ్యులు బికుమాండ్ల వెంకట్, పీఆర్‌ఓ పాష హాజరైయ్యారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్స్ డేను పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఆస్పత్రిలోని రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పరీక్షిత్ నరేందర్, డాక్టర్ నాగరాజు, డా.జయశ్రీ, డాక్టర్ విజయలక్ష్మి, సీహెచ్ఓ విజయ, హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, సిబ్బంది ఏసుమణి, ఇందిర, అలివేలు, మునిర, వేణు, సీత, ఆసీఫా, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'గ్రూప్-4'



కడ్తాల్: పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-4 పరీక్షలు శనివారం ఇబ్రహీపట్నం, ఆమనగల్లు నియోజకవర్గాల్లో ప్రశాంతంగా ముగిశాయి. అభ్యర్థులు గంట ముందే పరీక్ష సెంటర్లకు చేరుకున్నారు. నిర్వాహకులు వారిని తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. పలు సెంటర్లలో అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు చేపట్టారు. – సాక్షి, నెట్‌వర్క్



ఆమనగల్లు: పరీక్షా కేంద్రంలో గ్రూప్- 4 పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు



ఇబ్రహీంపట్నం: నోటీసు బోర్డుపై హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు

ట్రాఫిక్ జామ్..



అంబేడ్కర్ చౌరస్తాలో గ్రూప్-4 ఎఫెక్ట్‌తో ట్రాఫిక్ జామ్

ఇబ్రహీంపట్నం: గ్రూప్-4 పరీక్షలు రాసేందుకు వేలాది మంది రావడంతో ఇబ్రహీంపట్నంలో శనివారం సాయంత్రం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పేపర్-2 పరీక్ష సాయంత్రం 5 గంటలకు పూర్తి కావడంతో ఒక్కసారిగా అభ్యర్థులు వారికి సహాయకులుగా వచ్చిన వారంతా వివిధ వాహనాల్లో రోడ్డెక్కడంతో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సుమారు గంట పాటు రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. ఇబ్రహీంపట్నంతో పాటు చుట్టుముట్టు సుమారు 15 పరీక్ష కేంద్రాలు ఉండడంతో రద్దీ పెరిగింది. పరీక్షల బందోబస్తు, పేపర్ల తరలింపులో పోలీసులు ఉండడంతో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేవారు కరువైయ్యారు. నియంత్రించే వారు లేక పోవడంతో అడ్డగోలుగా చౌరస్తాలో వాహనాలు వెళ్తుండడంతో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం ఏర్పడింది. హోటళ్లకు గిరాకీ బాగా పెరిగింది. బస్సులు రద్దిగా ప్రయాణించాయి.